సామెతకథలు

# మక్కికి మక్కి నకలు

- శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

ఒక ధనికుని వద్ద ఒక గుమస్తా ఉండేవాడు. అతనికి నిత్యము కట్టల కొద్ది నకళ్ళు వ్రాయుటేపని. అతడు తన యజమానిని మెప్పించుటకై తూచాలు తప్పకుండా జాగ్రత్తగా వ్రాస్తూ మెప్పుపొందేవాడు. ఒకనాడా ధనికుడు చినిగిన అచ్చుపుస్తకము తీసికొనివచ్చి "ఇది పూర్తిగా చినిగిపోయినట్లయితే మఱి క్రొత్త పుస్తకం దొరకదు. త్వరలో ఇది అచ్చు అయ్యే సూచనలు కూడా లేవు. కాబట్టి దీనిని సరియైన నకలు వ్రాసి ఇవ్వవలసింద"ని ఆజ్ఞాపించెను.

వ్రాయసకాడు పుస్తకం పదిలంగా తీసికొని జాగరూకతతో వ్రాయడం మొదలుపెట్టి సకాలంలో నకలు తయారు చేసాడు. అచ్చులో ఎన్ని పుటలుంటే వ్రాతప్రతిలో కూడా అన్ని పుటలే ఉన్నాయి. పుటకు ఎన్ని పంక్తులు ఉంటే సరిగా అన్ని పంక్తులే నకలు పుస్తకము నందును వ్రాయబడ్డాయి. పంక్తి ప్రారంభమునందును, అంతమందును గల యక్షరములు మాతృకలో వలెనే సరిగా వ్రాయబడ్డాయి. గుమస్తా నకలు పుస్తకాన్ని, మాతృకను తీసికొని వెళ్ళి యజమానికి సమర్పించుకున్నాడు.

యజమాని రెండు పుస్తకాలు దగ్గఱపెట్టుకొని, ఏమైనా తేడాలున్నవేమోయని దీక్షగా పరిశీలింపడానికై పుటలన్నిటిని త్రిప్పిత్రిప్పి చూచాడు. ఎక్కడా వ్రాతప్రతిలో తప్పులు కనిపించలేదు. ఒక్క పుటలో మాత్రం బుద్ధి పూర్వకంగా చచ్చిన ఈగను అంటించినట్లు జాడ కానరావడంచేత మాతృకను పరిశీలించి చూచాడు. అందులో కూడా అట్లే ఉండడం చూసి లోలోన గుమస్తా యొక్క నిజాయితీకి అవివేకానికి పకపకా నవ్వుచు "ఓయీ! ఈ పుటను ఇట్లా మకిలి చేశావేమి?" అని అడిగాడు.

గుమస్తా "అయ్యా! మాతృకలో చచ్చి అంటుకొనియున్న మక్షికం కానవచ్చింది. నేను ఏమార్పు లేని సరియైన నకలు తయారు చేయవలసి యుండడంచేత పాపమని తెలిసినా తప్పని సరిగా మక్కిని చంపి జాగ్రత్తగా మాతృకలో ఉన్నట్లే అంటించాను. తడి ఆరిపోయిన పిమ్మట పుట అంత ఖరాబుగా ఉండదులెండి" అన్నాడు.

స్వామికి తన ఆజ్ఞలను సరిగా మన్నించి నందున ఒకవైపు సంతోషం, అతని అమాయకత్వానికి వేఱొకవంక విచారం కలిగింది. ఆ విధముగా ఇచ్చిన పనిని తు. చ. తప్పకుండా, యథాతథంగా చేస్తే మక్కికి మక్కి అనడం స్థిరపడింది

(అసలు కథకు కొన్ని మార్పులు చేసి ప్రచురించడం జరిగింది.)

**" తీతువుపిట్ట రాయబారం" సామెత కథ వచ్చే సంచికలో ...**